క్లుప్తంగా

వైభవంగా గాయత్రి హోమం



అమలాపురంలో హోమం నిర్వహిస్తున్న సాధకులు

అమలాపురం రూరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని అదిశేష నిలయంలో గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రి హోమం, మహాలక్ష్మి హోమం ఘనంగా నిర్వహించారు. నూకల కుమారి, ప్రసాద్ దంపతులచే మహాలక్ష్మి సాధన, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక గాయత్రి మంత్రోచ్చారణ చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో గోశాల వ్యవస్థాపకులు పోతురాజు రామకృష్ణారావు, మహాలక్ష్మి సాధకులు పోతురాజు కనకదుర్గ, లింగోలు శిరీష, తూము దొరబాబు, లింగోలు విస్సు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి రంగాచార్యులు నేతృత్వంలో తాళ్లరేవు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ధూళిపూడి నాగేంద్రప్రసాద్ దంపతులచే అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాన్ని నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యన్నారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు, పంపన రామకృష్ణ, ధూళిపూడి చిట్టిబాబు, దొరబాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి నవరాత్ర ఉత్సవాలు



విశేష అలంకరణలో షిర్డీ సాయిబాబా

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేటలో కొలువైన శ్రీ షిర్డీ సాయిబాబా నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 24న ప్రారంభమైన ఉత్సవాలు నవంబర్ 1 వరకూ కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సాయిబాబాకి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కాటంశెట్టి కుటుంబసభ్యుల సహకారంతో భజన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఆలయ అర్చకులు కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పుదుచ్చేరి పరిధిలో 10,07,179 మంది ఓటర్లు

యానాం: పుదుచ్చేరి పరిధిలోని యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో కలిపి మొత్తంగా 10,07,179 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వల్లవన్ ఆదివారం తెలిపారు. దాంట్లో పురుష ఓటర్లు 4,73,354 మంది, మహిళా ఓటర్లు 5,33,680 మంది, థర్డ్ జెండర్ 145 మంది ఉన్నారన్నారు. యానాం నియోజకవర్గంలో 38,742 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 18,717 మంది, మహిళలు 20,025 మంది ఉన్నారని చెప్పారు. డిసెంబర్ 9 వరకూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల తొలగింపు, సవరణ, నమోదులు సంబంధిత బీఎల్‌ఓలు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేక ఓటు నమోదు క్యాంపులను వచ్చే నెల 4, 5, 18, 19 తేదీల్లో నిర్వహిస్తామన్నారు.

కొమ్మల్లో యమపాశాలు



ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం రోడ్డులో చెట్ల కొమ్మల్లో దాగి ఉన్న విద్యుత్ తీగలు

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం మెయిన్‌రోడ్డులో చెట్ల కొమ్మల్లో దాగిన విద్యుత్ తీగలు యమపాశాల్లా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావటంతో అటుగా సంచరించే స్థానికులకు, పశువులకు ప్రమాదాలు కొనితెచ్చేలా ఇవి కనిపిస్తున్నాయి. గాలి వీచినప్పుడల్లా కొమ్మల్లో నిప్పురవ్వలు రేగుతూ గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొమ్మల తొలగింపు అని విద్యుత్ అధికారులు సరఫరా నిలిపేస్తున్నా ఇలాంటి దృశ్యాలు ఎక్కడికక్కడే కనిపిస్తున్నాయి. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగులకు సదరమ్‌తో భరోసా

- సచివాలయంలోనే స్లాట్ బుకింగ్
- నవంబర్ 15 దరఖాస్తుకు చివరి గడువు



సదరమ్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లవరం: దివ్యాంగుల జీవితాలకు భరోసాగా నిలిచే సదరం సర్టిఫికెట్‌ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. దివ్యాంగులకు పునరావాసం, సాధికారిత కోసం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వెబ్ సొల్యూషన్స్ ద్వారా సదరమ్ లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. సదరం స్లాట్‌ని తెరిచి అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులను సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం సదరం సర్టిఫికెట్‌ని అందించే ఏర్పాటు చేస్తున్నారు. అక్టోబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమైన స్లాట్ బుకింగ్ నవంబర్ 15 వరకూ దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చింది.

సర్టిఫికెట్‌తో ప్రతినెలా పింఛన్

మూగ, చెవిటి, కంటి చూపు లేనివారు, మానసిక విభాగానికి చెందినవారు, ఎముకలు విరిగి అంగవైకల్యం ఏర్పడినవారు, పుట్టుకతోనే అంగవైకల్యంతో ఉన్నవారు సదరమ్ స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సదరమ్ స్లాట్‌ని నమోదు చేసుకోవడానికి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ని సంప్రదించి ఆధార్ కార్డు, అంగవైకల్యం తెలిపే ఫొటోలు, చిరునామా, ఆధార్ కార్డులని లింక్ చేసిన ఫోన్ నెంబర్‌తో సంప్రదించవలసి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని 23 సచివాలయ పరిధిలో 1,123 మంది దివ్యాంగులు ఇప్పటికే సదరమ్ ద్వారా సర్టిఫికెట్ పొంది ప్రభుత్వం నుంచి ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా రూ.33.96 లక్షల పెన్షన్ మొత్తాన్ని వలంటీర్లు అందిస్తున్నారు. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు పెన్షన్ మంజూరు కొరకు వలంటీర్ లాగిన్ నుంచి అప్‌లోడ్ చేయడానికి ఇప్పటికే వలంటీర్లకు మార్గదర్శకాలు ఇచ్చారు.

స్లాట్ బుకింగ్‌లు వేగవంతం



సదరమ్ స్లాట్ బుకింగ్ తెరుచుకోవడంతో సచివాలయాల వారీగా వెల్ఫేర్ అసిస్టెంట్లకు మార్గ దర్శకాలు జారీ చేశాం. నవంబర్ 15 నాటికి అర్హులను గుర్తించి సదరం స్లాట్ బుకింగ్ ఇవ్వాలని సూచించాం. అలాగే క్షేత్రస్థాయిలో వలంటీర్లు కూడా సదరంపై అవగాహన కల్పిస్తున్నారు. వారి ద్వారా సదరం స్లాట్ బుకింగ్‌లు వేగవంతం చేస్తున్నాం.

– బీఎస్‌ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, అల్లవరం

అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: మండలంలోని బాణాపురంలో సత్తెమ్మ తల్లి గుడి దగ్గరలో కల్యాణ మండపం అభివృద్ధి పనులను టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ నేత భూపతిరాజు సుదర్శనబాబు బతికుండగా ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను నిధులు అడిగారన్నారు. ఆయన కృషి వల్లే అభివృద్ధి పనుల కోసం రూ.25 లక్షల ఎంపీ నిధులు విడుదలయ్యాయని కొనియాడారు. అందుకే కల్యాణ మండపానికి భూపతిరాజు సుదర్శనబాబు పేరు పెడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, వైస్ ఎంపీపీ తోట మాణిక్యం, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, ఢిల్లీ నారాయణ, సొసైటీ అధ్యక్షుడు విత్తనాల శ్రీనివాసరావు, ధూళిపూడి చక్రం, దంగుడుబియ్యం వెంకటరామయ్య, పెన్మత్స వాసురాజు, కాటం సత్తిరాజు, సఖిలే వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధి జీఎంసీ కాలనీలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధమై సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. రెండు పోర్షన్ల ఇల్లు కాలిపోవడంతో మెండి అర్జునరావు, మెండి వాసుదేవల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సహాయక చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

తాళ్లరేవు: పోరాటాలు చేయడం ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ మండల కౌన్సిల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూటీఎఫ్ ఉపాధ్యాయుల పక్షాన ఉండి ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్ధనరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతమిచ్చి అనేక నిధులు కేటాయించిందన్నారు. నాడు–నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చివేశారని, కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యను అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. యూటీఎఫ్ తాళ్లరేవు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఎం.తాతారావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ త్రిమూర్తులు, కోశాధికారిగా కె.ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా జి.సత్యన్నారాయణ, సహ అధ్యక్షులుగా కె.వీరేంద్రకుమార్, జె.నీరజ ఎంపికయ్యారు.

సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పెనుమల్లేలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెనుమల్లేలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. పెనుమల్లేలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలను అమలుచేస్తూనే మరోవైపు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచ్ వంకా ఏడు కొండలు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, బీర ధనుంజి, సంసాని నాగేశ్వరరావు, నాతి సత్యనారాయణ, బీర సత్యనారాయణ, చొల్లంగి వెంకటేశ్వరరావు, గంటి వెంకట సుధాకర్, కాశి హనుమంతరావు, నల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు



విద్యుత్ అధికారులు తొలగించిన ట్రాన్స్‌ఫార్మర్

అల్లవరం: మండలంలోని కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి ఆగమేఘాలపై తొలగించారు. జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇళ్ల నిర్మాణానికి అడ్డంకిగా మారి పురోగతి లోపించిందని విద్యుత్ అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ కృష్ణమోహన్ సమస్యను ప్రస్తావించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎంపీడీఓ, విద్యుత్, హౌసింగ్ అధికారులను సమన్వయపరిచి వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. దీంతో విద్యుత్ అధికారులు శనివారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లాకు స్థానిక ఇళ్ల లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రియేటివ్ హార్ట్స్ సంస్థకు ఆర్ట్ గెలాక్సీ అవార్డు



చిత్రకారుడు ఆకొండి అంజిని సత్కరిస్తున్న సృష్టి ఆర్ట్ అకాడమీ

కాట్రేనికోన: స్థానిక క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ చిత్ర కళలో చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్ అకాడమీ ఆర్ట్ గెలాక్సీ అవార్డుకు ఎంపికచేసింది. క్రియేటివ్ హార్ట్స్ అధినేత ఆకొండి అంజికి అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు అందుకున్న చిత్రకారుడు అంజిని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్‌లు అభినందించారు.

చైర్మన్ పోస్టుల కోసం నేతల డిమాండ్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ రంగ సంస్థలైన పబ్లిక్ అండర్ టేకింగ్స్ కార్పొరేషన్‌ల చైర్మన్ పోస్టులను బీజేపీతో పాటు ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలకు ఇవ్వాలని ఆదివారం జరిగిన బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో పలువురు నేతలు డిమాండ్ చేశారు. సీనియర్ బీజేపీ నేత నిర్మల్‌కుమార్ సురేనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు కల్యాణసుందరం, రిచర్డ్ మాట్లాడారు. బీజేపీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లకు పైగా అవుతున్నా తమకు చైర్మన్ పోస్టులు ఇవ్వలేదన్నారు. అదేవిధంగా ప్రభుత్వానికి మద్దతిస్తున్న యానాం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, అంగళన్, శివశంకర్ తదితరులకు చైర్మన్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చర్యలు కోరుతూ ధర్నా

అమలాపురం రూరల్: విజయవాడ ఆటోనగర్ డిపోకి చెందిన బస్సు డ్రైవర్‌పై కావలి వద్ద కొంతమంది దాడి చేయడంపై అమలాపురం డిపోలో కార్మికులు, కార్మిక నాయకులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. డ్రైవర్‌పై దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పితాని మణిరాజు, కార్యదర్శి పందిరి రాంబాబు, ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి గంటి చిరంజీవి, డిపో అధ్యక్షుడు పితాని రమణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి మట్టి తరలింపు



ఢిల్లీకి పయనమైన ఉపాధి కార్యాలయ ఆపరేటర్ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది

అల్లవరం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా అల్లవరం మండలంలోని 21 పంచాయతీల్లో సేకరించిన మట్టిని అమృత కలశాలలో భద్రపరిచి దేశ రాజధాని ఢిల్లీకి తరలించారు. ఉపాధి కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ నాగేశ్వరరావు మట్టిని తీసుకుని ఢిల్లీలోని అమృతవనంలో ఇచ్చేందుకు ఆదివారం పయనమయ్యారని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. గ్రామాల్లో సేకరించిన మట్టిని ఢిల్లీ చేరడంతో ఈ కార్యక్రమం సంపూర్ణం అవుతుందని ఆయన చెప్పారు.

మంత్రి హామీని స్వాగతిస్తున్నాం



బాధిత కుటుంబ సభ్యులకు అభయ్ ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సాయి శ్రీనివాస్

అమలాపురం టౌన్: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ బిల్లులన్నీ ప్రభుత్వమే నేరుగా చెల్లించే విధానాన్ని ఎస్టీయూ స్వాగతిస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ అన్నారు. అమలాపురంలోని జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు చింతా సత్యనారాయణకు ఎస్టీయూ అభయ్ ద్వారా రూ.2 లక్షల సాయాన్ని సాయి శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉండవల్లి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యాయ సంఘాల చైర్మన్ నాగిరెడ్డి ప్రసాద్, సుదర్శన చక్రవర్తి, ఎస్ఎస్ పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులు సామాజిక సేవల్లో ముందుండాలి



రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్‌ను సత్కరిస్తున్న అమలాపురం స్వర్ణకార సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని స్వర్ణకారులు సామాజిక సేవల్లోనూ ముందుండాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ పిలుపునిచ్చారు. అమలాపురం దుడ్డివారి అగ్రహారంలోని పట్టణ స్వర్ణకారుల సంఘ భవనంలో ఆదివారం జరిగిన సంఘీయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల అమలాపురం పట్టణ స్వర్ణకార సంఘానికి ఎన్నికైన నూతన కార్యవర్గంతో మాట్లాడి సంఘపరంగా పలు విధి విధానాలను వివరించారు. పట్టణ సంఘానికి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన భరణికాన బాబు, సంఘ ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం సంఘ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘం కార్యదర్శి ఓదూరి ఫణికుమార్, కోశాధికారి చింతా నాని, ఆవుపాటి గోపాలం, పుల్లేటికుర్తి భాస్కరరావు, తాళాబత్తుల లక్ష్మణరావు, అనుపోజు శ్రీనివాస్, చేబోలు శేఖర్, తాళాబత్తుల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం... మనోహరం

- భేతాళుని వాహన మహోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గంగలకుర్రు మలుపులో చెడీ తాలింఖానాను ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: శరన్నవరాత్రుల అనంతరం అంబాజీపేటలో జరిగే విజయభేతాళ వాహన మహోత్సవం ఆద్యంతం మనోహరంగా సాగింది. 1967లో ప్రారంభించిన ఈ వాహన మహోత్సవం నేటికి 57 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ అదే సంప్రదాయ రీతిలో సాగింది. 13 పాలాలకు చెందిన వివిధ రకాల గ్రామమూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ స్థానిక సెంటరులో కొలువుదీరి భక్తులను కనువిందు చేశాయి. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భేతాళస్వామి సంబరాలు ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ అట్టహాసంగా, కనులవిందుగా సాగాయి. శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయభేతాళ స్వామి ఆలయం వద్ద నుంచి ఆధ్యాత్మిక సంబరాలు ప్రారంభమయ్యాయి. 13 పాలేల నిర్వాహకులు దేవతామూర్తులను వాహనాలపై పెట్టి రంగురంగుల విద్యుత్‌దీపాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళతాళాలు, బాజా భజంత్రీల పురవీధుల్లో ఊరేగించారు. వాహనాల ముందు చెడీ తాలింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. గరగ నృత్యాలు, కోబ్రా, శక్తి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్థానిక సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తులను ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు దర్శించుకున్నారు.



గంగలకుర్రు మలుపులో విద్యుత్ దీపాలంకరణలో విజయగణపతి



వాహనంపై కొలువుతీరిన శ్రీకృష్ణుడు

కొలువుతీరిన వాహనాలివే..

శ్రీనివాసనగర్ నుంచి గరుత్మంతుడు, పెచ్చెట్టివారిపాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామ్‌నగర్ నుంచి సింహం వాహనం, దొమ్మేటివారిపాలెం శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారిపాలెం ఆంజనేయస్వామి, పోతాయిలంక ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు విజయగణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి నుంచి హంస వాహనం, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుంచి శ్రీషిరిడిసాయిబాబా, గుత్తులవారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరిదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు ఈ ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు కనువిందు చేశాయి.

బాలాజీని దర్శించుకున్న విద్యాశాఖ ఏడీ



అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకుంటున్న విజయలక్ష్మి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏడీ విజయలక్ష్మి శ్రీదేవి, భూదేవి సమేతం బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు కాకినాడ డీఈఓ ఆఫీస్ ఏఎస్‌ఓ కె.వెంకటేశ్వరరావు, ఏపీఓ వి.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి కామేశ్వరరావు బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు స్వామి వారి శేషవస్త్రం బహూకరించి, మహదాశీర్వచనం అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ చిక్కం సత్యప్రసాద్, ఉపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ ఉన్నారు.

క్వాయర్ ఉత్పత్తులతో ఆర్థిక స్వావలంబన



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ఏడీ అపర్ణలక్ష్మి

మామిడికుదురు: క్వాయర్ ఉత్పత్తుల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అపర్ణలక్ష్మి సూచించారు. ఈదరాడలో ఆదివారం హ్యాండీ క్రాఫ్ట్స్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు కొబ్బరి ఆధారిత పరిశ్రమల ద్వారా మహిళలు జీవనోపాధి పొందుతున్నారని అపర్ణలక్ష్మి పేర్కొన్నారు. ఇది మంచి పరిణామమని ఆమె పేర్కొన్నారు. పురుషుల కన్నా మిన్నగా కష్టపడి పని చేస్తూ ఆదాయం ఆర్జించడం ముదావహమన్నారు. నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం పెరిగిందన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్ ఉభయ రాష్ట్రాల మెగా క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధీర్ మాట్లాడుతూ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.